క్లుప్తంగా

డీఎల్పీవో విచారణ

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీఎల్పీవో శ్రీనివాస్ శనివారం విచారణ చేపట్టారు. గ్రామంలో వీధి లైట్లు వెలగడంలేదని, మురుగు కాలువలు తీయడం లేదని గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా డీఎల్పీవో పలు రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలోని వీధిలైట్లు, డ్రైనేజీలను పరిశీలించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులో మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. రెండు ట్రాక్టర్లలో ఇసుకను జమ్మికుంటకు తరలిస్తుండగా నర్సింగాపూర్ గ్రామ శివారులో పట్టుకున్నామని, ఇసుక రవాణాకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ట్రాక్టర్లతో పాటు యజమానులు బండారి రమేశ్, ఐలవేని అనిల్‌పై కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

అమరుల కుటుంబాలకు న్యాయం చేయాలి

జమ్మికుంట: ప్రత్యేక రాష్ట్రం సాధించుకొని పదేళ్లు పూర్తి చేసుకొని ఉత్సవాలు నిర్వహించుకుంటున్న సందర్భంగా అమరుల కుటుంబాలకు న్యాయం జరగాలని బీఎస్పీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి మొగిలయ్య శనివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వందల మంది అమరులయ్యారని, సామాజిక తెలంగాణ రాలేదు, భౌగోళిక తెలంగాణ వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చిన ఆదాయాన్ని ఉచితాలకు ఖర్చు పెడితే పేదలు ఇంకా నిరుపేదలవుతారని, సీఎం రేవంత్‌రెడ్డి ఆదాయం దుర్వినియోగం కాకుండా చూడాలని కోరారు.

తూర్పువాడ రైతు సంఘం

చొప్పదండి: పట్టణంలోని తూర్పువాడ రెడ్డి రైతు సంఘం నూతన అధ్యక్షుడిగా గుర్రం జువ్వాజి వెంకటరమణారెడ్డి శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడు, కోశాధికారిగా గుర్రం రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా బద్దం సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శిగా బద్దం శశిధర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గుర్రం దేవేందర్ రెడి, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, ముత్యాల నిఖిల్ రెడ్డి నియామకమయ్యారు.

నియామకం

హుజూరాబాద్: ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా కొలుగూరి సూర్యకిరణ్‌ను నియమిస్తూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నమ్మకంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి సూర్యకిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.

అలసత్వం ప్రదర్శించినవారిపై చర్యలు తీసుకోవాలి

చొప్పదండి: పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ పనుల్లో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మున్సిపల్ కౌన్సిలర్ వడ్లూరి గంగరాజు కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ... కొందరు బీజేపీ నాయకులు రోడ్డు ప్రమాదానికి మున్సిపాలిటీదే బాధ్యత అంటూ ఆరోపణలు చేయడం అవగాహన లోపానికి నిదర్శనమన్నారు. పనులు నిర్వహించేంది ఏశాఖనో కూడా తెలియకుండా మాట్లాడటం సరికాదన్నారు.

క్రికెట్ క్లబ్ కార్యవర్గం

రామడుగు: రామడుగు మండల క్రికెట్ క్లబ్ 2024 నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎడవెల్లి ఆనందరెడ్డి, ఉపాధ్యక్షులుగా ముంజాల ప్రవీణ్, ఆరపెల్లి ప్రశాంత్, కార్యదర్శిగా నీలం చందు, సహాయ కార్యదర్శిగా కొత్త రమేష్, కార్యదర్శిగా బోదాసు తిరుపతి, సయ్యద్ ఫిరోజ్, పూరెల్ల మనోజ్, సలహాదారులుగా గుండి వినయ్, కార్యవర్గ సభ్యులుగా రాగం మహేష్, నిమ్మనవేని సురేష్, మామిడి ప్రవీణ్, పెసరి అజయ్, సంపత్, పుట్ల శ్రీనివాస్, గొల్ల శ్యాం, రేగుల మధు, ఎండీ మాస్ను ఎన్నికయ్యారు. కాగా రామడుగు ప్రీమియర్ లీగ్ సీజన్–2 రామడుగు మండల స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జూన్ 2వ తేదీలోపు రూ. రెండు వందలు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9010686849 తిరుపతి, 9652641596 మనోజ్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలన్నారు.

సిగ్నేచర్ డే



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగేళ్ల మెకానికల్ విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న విద్యార్థులు శనివారం సిగ్నేచర్ డే నిర్వహించారు. విద్యార్థులు టీ షర్టులపై సంతకాలు చేసుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

పల్లెల్లో కూలర్ల మోత

- దంచికొడుతున్న ఎండలు
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- పగలు, రాత్రి తేడాలేకుండా తిరుగుతున్న కూలర్లు
- అమాంతం పెరిగిన విద్యుత్ వినియోగం
- ఉచిత కరెంట్‌పై ప్రభావం



అమ్మకానికి సిద్ధంగా కూలర్లు

వీణవంక: రోహిణి కార్తెలో భానుడు తనప్రతాపం చూపుతున్నాడు. ఇరవై రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరుగుతున్నాయి. రాష్ట్రంలోనే వీణవంక మండలంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. దీంతో గ్రామాల్లో ఉక్కపోతను తట్టుకోలేక జనం పగలు, రాత్రి తేడాలేకుండా కూలర్లు మోత మోగిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు, వడగాలులతో బయటకి వెళ్లాలంటే జనం జంకుతున్నారు. కూలర్ల వినియోగం పెరగడంతో విద్యుత్ వినియోగంపై ప్రభావం పడుతోంది. అధిక లోడ్‌తో సబ్‌స్టేషన్లలో కరెంట్ ట్రిప్ అయ్యే పరిస్థితి నెలకొంది. మండలంలో 26 గ్రామ పంచాయతీలు, 52వేల జనాభా, 17,520 కుటుంబాలు ఉన్నాయి. సగటున 10 వేల కుటుంబాల్లో కూలర్లు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. కూలర్లు, ఫ్యాన్లు ఎంత తిరిగినా ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు.

పెరిగిన కూలర్ల వినియోగం...

20రోజుల నుంచి కూలర్ల వినియోగం పెరిగింది. ఇప్పటికే నియోజకవర్గంలో 4 వేల కూలర్ల అమ్మకాలు జరిగినట్లు తెలిసింది. ఒక్కో కూలర్ మార్కెట్లో రూ.3వేల నుంచి 12వేల వరకు లభిస్తున్నాయి. ఫ్యాన్ల ద్వారా వేడి వస్తోందని ఉపశమనం కోసం కూలర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. గ్రామీణ ప్రాంత జనం కూలర్ల కింద సేదతీరుతున్నారు. కూలర్ల అమ్మకాలు గతేడాదితో పోల్చితే ఈ ఏడు రెండింతలు పెరిగే అవకాశం ఉంది.

ఉచిత కరెంట్‌పై ప్రభావం ...



వీణవంకలోని ఓ ఇంట్లో తిరుగుతున్న కూలర్

కూలర్ల మోతతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగం పెరిగింది. వీణవంక మండల పరిధిలో ఆరు 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. సగటున ఒక్కో ఇంట్లో రోజుకు 6 నుంచి 9 యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. వీణవంక సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో లోడ్ అధికమవుతోంది. కూలర్లు వల్ల విద్యుత్ బిల్లులు వాచిపోనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గృహజ్యోతి పథకం కింద సీఎం రేవంత్‌రెడ్డి 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్ అందిస్తున్నారు. పథకం పొందిన వారికి కరెంట్ బిల్లు నుంచి విముక్తి లభించినా పథకం అమలు కానీ వారికి బిల్లుల మోత మోగనుంది. ప్రతినెలా మండల వ్యాప్తంగా సుమారు రూ.25లక్షల బిల్లు వస్తుండగా, మే నెల బిల్లు రూ.50 లక్షలు దాటే అవకాశం ఉంది. ఈ లెక్కన గృహజ్యోతి పథకం కింద లబ్ధి పొందిన వారి బిల్లులను ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంది. ఫ్రీ కరెంట్ కదా అని కొంత మంది ఇష్టానుసారంగా విద్యుత్ వాడుతున్నారు. 200 యూనిట్ల దాటితే ఆ బిల్లు లబ్ధిదారుడే చెల్లించాల్సి ఉంటుంది. అవసరం ఉన్నప్పుడు మాత్రమే విద్యుత్ వినియోగించుకుంటే మంచిది. ఎండలు మరో రెండు మూడు రోజులు ఇలాగే ఉంటాయని వాతావరణశాఖ తెలుపుతుండటంతో జనం జంకుతున్నారు.

భరించలేకపోతున్నాం

ఎండలు దంచికొడుతున్నాయి. వ్యవసాయ పనులకు వెళ్లలేకపోతున్నాం. రోహిణి కార్తెలో ఇంతలా ఎండలు కొట్టడం ఎప్పుడు చూడలేదు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు ఇంట్లోనే ఉంటున్నాం. కూలర్, ఫ్యాన్ వినియోగించినా ఉక్కపోత భరించలేకపోతున్నాం. ఎండ, వడగాలులతో అవస్థలు పడుతున్నాం. కరెంట్ పొదుపు చేస్తూ ఇంటి ముందు వేపచెట్టు కింద సేదతీరుతున్నాం. ఎండలు ఇట్లనే దంచి కొడితే బతకడం కష్టమే.

– అనిల్ , రైతు, మల్లన్నపల్లి

‘ఎమ్మెల్యే కవ్వంపల్లిని విమర్శిస్తే ఊరుకోం’



సమావేశంలో మాట్లాడుతున్న కోండ్ర సురేశ్, శ్రీకాంత్‌గౌడ్, సహదేవ్, శ్రీనివాస్, అజయ్, తదితరులు

మానకొండూర్: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ యువజన నాయకులకు లేదని కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోండ్ర సురేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు దేనికి బ్రాండో చెప్పాలని, మానకొండూర్ చెరువుకట్టకు ఎన్ని నిధులు వచ్చాయో తెలుసుకుంటే మంచిదని ఆ నిధులు ఎటు వెళ్లాయో తెలుసుకోవాలని, మినీ ట్యాంక్‌బండ్ చేస్తామని, విగ్రహాలు పెడతామని, పర్యాటక కేంద్రంగా మారుస్తామని గొప్పలు చెప్పిన నాయకులు ఏమయ్యారని, అభివృద్ధి చేయలేదు కాబట్టే కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నాయకులు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కవ్వంపల్లిని విమర్శిస్తే ఊరుకోబోమన్నారు. నాయకులు బుర్ర శ్రీకాంత్ గౌడ్, మాతంగి సహదేవ్, నల్లాల శ్రీనివాస్, కనుకుంట్ల అజయ్, కనకం రాకేష్, నాగరాజ్, బుర్ర అచ్చుత్, కార్తీక్, సుభాష్, మనోహర్ పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన యువసేన ఆధ్వర్యంలో కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లే హనుమాన్‌స్వాములకు శనివారం కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి వెలిచాల చౌరస్తా వద్ద మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, సేవా సమితి నాయకులు గుమ్మడి రమేష్, జగిత్యాల జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు తరాల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న యువసేన సభ్యులు

కలర్ డబ్బాలు అందజేత

జమ్మికుంట: పట్టణానికి చెందిన టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ అలుగునూర్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ సొసైటీ సెంట్రల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ) విద్యాలయం ప్రిన్సిపల్ దేవేందర్‌రెడ్డికి రూ.ఐదువేల విలువ గల కలర్ డబ్బాలను శనివారం అందజేశారు. గురుకుల విద్యా సంస్థల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు అంబేడ్కర్ సూచించిన మార్గంలో సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ సొసైటీలో చదువుకొని సమాజంలో కళాకారుడిగా, సామాజిక కార్యకర్తగా, క్రీడా కారుడిగా ఎదిగానని సొసైటీకి రుణపడి ఉంటానన్నారు.



కలర్ డబ్బాలు అందజేస్తున్న అంబాల ప్రభాకర్

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు

కొత్తపల్లి: రైతులకు నాసి రకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి రంజిత్‌కుమార్ అన్నారు. శనివారం కొత్తపల్లి మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాల్లో తనిఖీ నిర్వహించారు. డీలర్లు లైసెన్స్ గడువు, విత్తన స్టాక్ రిజిస్టర్లు, విత్తన ధరల పట్టికలను రోజువారీగా మెయింటైన్ చేయాలని సూచించారు. రైతులు ప్రభుత్వ అనుమతి పొందిన విత్తన డీలర్ల దగ్గర విత్తనాలు చేయాలని,, ఒకే రకం పత్తి విత్తనాలపై ఆధారపడొద్దని అన్నారు. అన్ని రకాల పత్తి విత్తనాలు దాదాపు ఒకే రకమైన దిగుబడి ఇస్తాయని తెలిపారు. రైతులు పాటించే యాజమాన్య పద్ధతులు సస్యరక్షణ చర్యలు మీద ఆధారపడి పంట దిగుబడి వస్తుందని అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో డీలర్ దగ్గర నుంచి రశీదు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. తక్కువ ధరకు వస్తుందని నాసిరకం విత్తనాలు కొని మోసపోకూడదని తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



కొత్తపల్లి: మండలంలోని ఆసిఫ్‌నగర్ జెడ్పీ హైస్కూల్‌లో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరెడ్డవేణి మధు –టీమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొత్తపల్లి మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ ప్రారంభించారు. విన్నర్ టీమ్‌కు రూ.15,000, రన్నర్ టీమ్‌కు రూ.8,000 ప్రైజ్‌మనీ ఇస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ రెడ్డవేణి మధు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు సాబీర్, ఎంపీటీసీ దామ కమలమనోహర్, నాయకులు కడారి శ్రీనివాస్, పెంచాల ఆంజనేయులు, తిరుపతి, దేవేందర్, గాలిపెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



లెక్చరర్‌ను అభినందిస్తున్న చైర్మన్ రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ పంచాయతీ పరిధిలోని శ్రీచైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్ కళాశాల మ్యాథమెటిక్స్ అధ్యాపకురాలు ఉషాభవానీ డాక్టరేట్ అందుకున్నారు. నల్గొండ జిల్లాలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ‘ఎక్సిస్టెన్స్ ఆఫ్ ఫిక్స్‌డ్ పాయింట్ థీరమ్స్ ఫర్ వేరియస్ కాంట్రాక్టివ్ మ్యాపింగ్స్ ఇన్ మెట్రిక్ స్పేసెస్ విత్ అప్లికేషన్స్’అంశంపై ఉషాభవాని పరిశోధన చేసిందని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి తెలిపారు. డాక్టరేట్‌ను ఎంజీ విశ్వవిద్యాలయం గైడ్ డాక్టర్ జి. ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అందుకున్నారని వివరించారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకురాలిని చైర్మన్ అభినందించారు. సంబంధిత సబ్జెక్ట్‌లో వస్తున్న నూతన ఆవిష్కరణలకు అనుగుణంగా విద్యార్థులకు ప్రజలకు ఉపయోగపడే విధంగా మరిన్ని సరికొత్త పరిశోధనలు చేపట్టాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. ప్రసాద్‌రాజు మాట్లాడుతూ.. మరింత ఉత్సాహంతో విద్యార్థులకు విద్యా బోధన చేయాలని కోరారు.

కిట్స్ అధ్యాపకుడికి..

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకుడు అర్షణపల్లి మహేందర్‌రావుకు డాక్టరేట్ వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.ఈశ్వరయ్య తెలిపారు. చైతన్య యూనివర్సిటీలో ప్రొఫెసర్ దోమల సురేష్ పర్యవేక్షణలో ‘సింతెసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ పాలిమర్ మెటల్ కాంప్లెక్స్ హైబ్రిడ్ ఫొటో కాటలిస్ట్ ఫర్ డీగ్రాడేషన్ ఆఫ్ ఆర్గానిక్ పొల్యుటెంట్స్’ అంశంపై పరిశోధన చేశారు. అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఈమేరకు యూనివర్సిటీ కంట్రోల్ ఎగ్జామినేషనర్ ప్రొఫెసర్ జగదీశ్వర్ డాక్టరేట్ ప్రదానం చేశారు. కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు మహేందర్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన వాలీబాల్ శిక్షణ

రామడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడామైదానంలో నెల రోజులుగా నిర్వహించిన వాలీబాల్ శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కోచులు సుంకె ఆశాలు, బర్కత్ అలీని క్రీడాకారులు శాలువాలు కప్పి సన్మానించారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన చాడ వెంకట్‌రెడ్డి



పరామర్శిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామంలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మృతుల కుటుంబాలకు సీపీఐ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వెంట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్, సింగిల్‌విండో డైరెక్టర్ చాడ శ్రీధర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిని పటేల్, మాజీ ఎంపీటీసీ కొండయ్య, నాయకులు తమ్మిశెట్టి రవీందర్, ప్రవీణ్, అంజయ్య పలువురు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



చొప్పదండి: పూజలు, భజనలు చేస్తున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వివిధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అక్కడక్కడ అన్నదానం చేపట్టారు. చొప్పదండి పట్టణంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో షిరిడీసాయి భజన మండలి సభ్యులు సత్సంగ్ నిర్వహించారు. హుజూరాబాద్ పట్టణం రంగనాయకుల గుట్ట వద్ద పాటిమీద ఆంజనేయస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. జమ్మికుంట మున్సిపల్, మండల పరిధిలో హనుమాన్ పెద్ద జయంతి ఘనంగా నిర్వహించారు. చిగురుమామిడి శివారులోని శ్రీపాంబండ పంచముఖాంజనేయస్వామి ఆలయంలో ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ జాతీయనేత చాడ వెంకట్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 మంది పుణ్యదంపతులతో ప్రత్యేక హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. తిమ్మాపూర్ మండల వ్యాప్తంగా హనుమాన్ ఆలయాల్లో జై శ్రీరాం, జైహనుమాన్ నామాలు మార్మోగాయి. హనుమాన్ దీక్షా పరులు, భక్తులు పూజలు నిర్వహించి, భజనలు చేశారు.



హుజూరాబాద్: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి తీర్థ ప్రసాదాలందజేస్తున్న ఆలయ అర్చకులు



హుజూరాబాద్‌రూరల్: కందుగుల గ్రామంలోని ఆలయంలో భజనలు చేస్తున్న భక్తులు



జమ్మికుంట: కొత్తపల్లిలో



చిగురుమామిడి శివారులో



తిమ్మాపూర్‌లో..

మంత్రి పొన్నంను కలిసిన నాయకులు

జమ్మికుంట/చిగురుమామిడి: రాష్ట్ర రవాణా, బీసీ, సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విదేశి పర్యటన పూర్తి చేసుకొని హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, కౌన్సిలర్ బొంగోని వీరన్న, మాజీ సర్పంచ్ జిల్లెల తిరుపతిరెడ్డి శనివారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చిగురుమామిడి మండలంలోని కాంగ్రెస్ నేతలు విమానాశ్రయంలో పొన్నంకు ఘనస్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో డీసీసీ అధికార ప్రతినిధి ప్రవీణ్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్‌సింగ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు అందె సురేశ్, ఠాకూర్ దిలీప్‌సింగ్ ఉన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్వాగతంపలుకుతున్న చిగురుమామిడి మండల కాంగ్రెస్ నాయకులు

యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సజ్జిద్

జమ్మికుంట: యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పట్టణానికి చెందిన మహమ్మద్ సజ్జిద్‌ను నియమించినట్లు ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బీవీ శ్రీనివాస్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, నాయకులు మజీద్‌ఖాన్, ఉమ్మడి జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్ బాబు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు, నాయకులు, కార్యకర్తలకు సజ్జిద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



మహమ్మద్ సజ్జిద్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జమ్మికుంట: మండలంలోని కోరపల్లి ఉన్నత పాఠశాల 2000–01 పదో విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ ఉపాధ్యాయులు దేవేందర్‌రెడ్డి, విఠల్‌రావు, మహిపాల్ రెడ్డి, సారయ్య, శ్రీనివాస్, ప్రస్తుత ప్రిన్సిపల్ సమ్మయ్యను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు భాస్కర్, వీరస్వామి, సురేష్, రమేష్, మధుకర్, మొండయ్య, నాగరాజు, సునీత, సుజాత, మమత, నాగలక్ష్మి, త్రివేణి, రజిత ఆత్మీయ సమ్మేళనానికి అందరూ హాజరయ్యే విధంగా కృషి చేశారు.